బీఆర్ఎస్‌లో చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

బేల మండలంలోని మాజీ సర్పంచ్ రోహిత్ దాస్ తోపాటు గోపాల్‌రామ్ లాల్, సంతోష్‌లు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, గంభీర్ రాక్రే, సతీశ్ పవార్, ప్రమోద్‌రెడ్డి, తన్వీర్ ఖాన్ పాల్గొన్నారు.

- జైనథ్(బేల), ఏప్రిల్ 15

పనులు చేసినా.. పూటగడవడం లేదు..

పల్సి జీపీ ఎదుట మల్టీ పర్పస్ కార్మికుల నిరసన

పల్సి జీపీ ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

కుభీర్, ఏప్రిల్ 15 : 'గ్రామంలో పనులు చేయకపోతే చెత్త కూరుకుపోతోంది. మురికి కాల్వలు పూడుకు పోతున్నాయి. జీతాలు ఇవ్వాల వస్తాయి, రేపు వస్తాయను కుంటూ ఏడు నెలలు గడుస్తున్నా వాటి ఊసేలేదు. జీతాలు లేక పస్తులుండే పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారికి రోజు మొరపెట్టుకుంటున్నా లాభం లేక పోయింది. మరి మాగోడు వినేవారెవరు' అంటూ తమ ఆవేదన వ్యక్తం చేశారు మండలంలోని పల్సి జీపీలో పని చేస్తున్న మల్టిపర్పస్ కార్మికులు. ఈ పంచాయతీలో ఏడుగురు కార్మికులు పని చేస్తున్నారు. ఏడు కుటుంబాలు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీపీ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రచారంలో భాగంగా ఉదయం టీ తాగుతూ ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి రామన్న, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

రేవంత్‌ది అధికారదాహం

అంబేద్కర్‌ను విస్మరించడం అహంకారానికి నిదర్శనం

● వంద రోజులైనా కేసీఆర్ పథకాలే అమలవుతున్నాయి.. ● పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఏప్రిల్ 15 : రేవంత్‌రెడ్డి అధికారదాహంతో అంబేద్కర్‌ను విస్మరించడం తన అహంకారానికి నిదర్శనమని, ఆయన యావత్ సమాజానికి క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉదయం వాకర్స్‌ను కలిసి సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా కేసీఆర్ ప్రభుత్వ పథకాలే అమలు అవుతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి సక్కు మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. అనంతరం స్థానిక సాత్నాల బస్‌స్టాండ్ సమీపంలో మమన్‌వాలే బాబా దర్గాలో చాదర్ సమర్పించారు. అక్కడున్న దుకాణ సముదాయాలు, బస్ స్టాండ్ సమీపంలో ప్రయాణికులను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో భాగంగా బీజేపీ అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డికి కరచాలనం చేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అలాల అజయ్, మజీ జడ్పీటీసీ ఇజ్జగిరి నారాయణ, నాయకులు సాజీదొద్దీన్, యూనిస్ అక్బానీ, రోకండ్ల రమేశ్, అశోక్ స్వామి, లింగారెడ్డి పాల్గొన్నారు.

మిర్చి బండి వద్ద ఓటు అభ్యర్థిస్తూ..

సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

కేటీఆర్ రాక

నేడు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న యువకిశోరం

● బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరు ● పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దిశానిర్దేశం

● తరలిరానున్న నాయకులు, కార్యకర్తలు, గులాబీ శ్రేణులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు(మంగళవారం) ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి యువనేత హాజరుకానున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, మథోల్, ఖానాపూర్, సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 2,111 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ప్రతి పోలింగ్‌స్టేషన్ నుంచి ఇద్దరు నాయకులు, నియోజకవర్గ బాధ్యులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో యువనేత పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, జిల్లాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్రంలో నాలుగు నెలల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రస్తావించే అవకాశాలున్నాయి. యువనేత పర్యటన సందర్భంగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కులు పర్యటనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల, గ్రామ స్థాయి నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన అనంతరం గులాబీ పార్టీ ప్రచారం ఉధృతం కానుంది.

బలంగా బీఆర్ఎస్

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉంది. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా బోథ్, ఆసిఫాబాద్ నియోజకర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆదిలాబాద్, ఖానాపూర్, సిర్పూర్ నియోజకవర్గాల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ 4,65,476 ఓట్లు రాగా, బీజేపీకి 4,48,967 ఓట్లు, కాంగ్రెస్‌కు 2,52,281 ఓట్లు వచ్చాయి. బీజేపీ కంటే బీఆర్ఎస్‌కు 16,509 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. నిర్మల్, మథోల్ నియోజకవర్గాలకు సమన్వయ కమిటీని నియమించారు. రెండు నియోజకవర్గాల్లో కొందరు నాయకులు పార్టీని వీడినా కార్యకర్తలు చెక్కుచెదరలేదు. నేడు ఆదిలాబాద్‌లో జరిగే బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగం నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపనుంది.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ గౌష్‌ఆలం, పోలీసు అధికారులు

మత్తు పదార్థాలను నిర్మూలించాలి..

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, ఏప్రిల్ 15 : మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో మత్తు పదార్థాలు, కల్తీ కల్లు, గంజాయి, నిర్మూలనకు తోడ్పడేలా ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడితే జరిగే అనర్థాలపై వివరిస్తూ షీ టీం ద్వారా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, డి. సాయినాథ్, కె.ఫణిధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఎదులాపురం, ఏప్రిల్ 15 : అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వాల్ పోస్టర్లను డీఎఫ్‌వో కేశావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముంబయి విక్టోరియా డాక్‌యార్డులోని ఓడ అగ్ని ప్రమాదంలో అమరులైన వారికి ఆత్మశాంతి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఏడీఎఫ్‌వో గోవర్ధన్‌రెడ్డి, ఎస్ఎఫ్‌వో శివాజీ, సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్, సినియర్ అసిస్టెంట్ రహీం పాల్గొన్నారు.

వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి(ఫైల్)

బాసర ట్రిపుల్ ఐటీలో ల్యాప్‌టాప్‌ల పక్కదారి !

● ఓ వెల్ఫేర్ ఆఫీసులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వద్ద ల్యాప్‌టాప్

● కేసీఆర్ సర్కారు ఇస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ ● అవి కూడా వెనక్కి తీసుకున్న అధికారులు..!

బాసర, ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో ఉన్నతాధికారులది ఆడిందే ఆట, పాడింతే పాటగా మారింది. లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన ల్యాప్‌టాప్‌లు విద్యార్థులందరికీ అందక పోగా పక్కదారి పడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో బాసర ట్రిపుల్‌ఐటీకి టెండర్ ద్వారా విద్యార్థుల కోసం కొన్ని ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారు. ట్రిపుల్‌ఐటీని సందర్శించిన వీఐపీలతో దాదాపు ఐదుసార్లు విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. విద్యార్థులకు ఇవ్వగా మిగిలిన దాదాపు 15 ల్యాప్‌టాప్‌లు పక్కదారి పట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వద్ద ట్రిపుల్ ఐటీ ల్యాప్‌టాప్..

బాసర ట్రిపుల్‌ఐటీని సందర్శించిన అప్పటి కలెక్టర్ పలువురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అదే సమయంలో జిల్లా కేంద్రంలో ఓ వెల్ఫేర్ ఆఫీసులో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ట్రిపుల్‌ఐటీ అధికారులు ఓ ల్యాప్‌టాప్‌ను అప్పనంగా అప్పజెప్పారు.

రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇచ్చినవి సైతం పక్కదారి

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బాసర ట్రిపుల్ ఐటీకి వచ్చిన ల్యాప్‌టాప్‌లను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ హైదరాబాద్‌లో 10 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. వాటిని ఇచ్చినట్టే ఇచ్చి అక్కడే ఉన్న ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులు ఇతరులకు చేరవేశారు. సదరు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి వచ్చాక మరో పది ల్యాప్‌టాప్‌లను వారికి అందజేశారు. ఈ విధంగా పక్కదారి పట్టిన ల్యాప్‌టాప్‌లను రికవరీ చేసి విద్యార్థులకు అందజేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎలాంటి తప్పు జరగలేదు

ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ

ల్యాప్‌టాప్‌ల పక్కదారి విషయమై ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వెంకటరమణను వివరణ కోరగా ఎలాంటి అవకతవకలు జరుగలేదని, ల్యాప్‌టాప్‌లు పక్కదారి పట్టలేదని తెలిపారు. ల్యాప్‌టాప్‌లకు సంబంధించి ఇన్‌చార్జిని సైతం నియమించామని, ఇందుకు సంబంధించిన వివరాలన్నీ ఆయన వద్ద ఉంటాయని తెలిపారు. ఏవైనా పక్కదారి పడితే రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చాకిరేవు గ్రామంలో చేతిపంపు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తాగునీటి ఎద్దడిని నివారించండి..

పెంబి, ఏప్రిల్ 15 : మారుమూల గిరిజన గ్రామమైన చాకిరేవులో 18 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామం మొత్తంలో ఒక్కటే చేతిపంపు ఉంది. తీవ్రమైన ఎండల కారణంగా ఉన్న చేతిపంపు అడుగంటిపోయింది. గంటల కొద్ది చేతిపంపును కొట్టినా ఒక్క బింద నిండడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చాకిరేవు గ్రామస్తులు చేతిపంపు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకుడు దత్తు మాట్లాడుతూ.. మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడవేసిన గొంగడి అక్కడే వేసినట్లుగా ఉందన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ కూడా లేదని తెలిపారు. అధికారులు స్పందించి తాగు నీటి ఎద్దడిని నివారించాలని కోరుతున్నారన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

దిలావర్‌పూర్, ఏప్రిల్ 15 : గుండంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, మాజీ ఎంపీపీ చిన్నారెడ్డి అన్న నర్సారెడ్డి మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. ఈయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నదేవేందర్‌రెడ్డి, బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి, నిర్మల్ రైతు వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ధర్మాజీగారి రాజేందర్, నిర్మల సహకార సంఘం మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనిల్, దనే రవి, సప్పల రవి, గంగారెడ్డి, భోజారెడ్డి, తిరుపతిరెడ్డి, ఒడ్నం కృష్ణ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అల్లోల

నిబంధనలు పాటించాలి..

● నిర్ణీత గడువులోపు నామినేషన్లు సమర్పించాలి.. ● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఏప్రిల్ 15 : ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అవలంబించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి నామినేషన్లను స్వీకరిస్తామని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అందించాలని పేర్కొన్నారు. ఆదివారం మినహాయించి మిగతా అన్ని పని దినాలను కలుపుకుని తుది గడువు 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నిర్ణీత గడువు, నిర్ణీత సమయంలోపు రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకున్న వారి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చని, అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారని తెలిపారు. పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గాల్లోని ఎవరైన ఒక ఓటరు నామినేషన్‌ను ప్రతిపాదిస్తే సరిపోతుందన్నారు. అదే రిజిస్టర్డ్ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. దాఖలైన నామినేషన్లు ఈనెల 26వ తేదీన పరిశీలించడం జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ గడువు అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ఉమ్మడి జిల్లా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కాలినడకన ఎంపీడీవో కార్యాలయానికి వెళ్తున్న కొలాం గిరిజనులు

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతూ..

నీటి కోసం నిరసన

ఎంపీడీవో కార్యాలయం ఎదుట బిందెలతో ఆందోళన

● బొజ్జుగూడలో వారం రోజులుగా తాగునీరు బంద్ ● నాలుగు కిలోమీటర్లు నడిచి తెచ్చుకుంటున్న కొలాం గిరిజనులు

నార్నూర్, ఏప్రిల్ 15 : భీంపూర్ పంచాయతీ పరిధిలోని బొజ్జుగూడ కొలాంగూడలో 15 కొలాం గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరు వారం రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తీసుకొచ్చి దాహం తీర్చుకుంటున్నారు. నెల రోజుల క్రితం పత్రికల్లో వార్తలు వచ్చాయి. కానీ.. ఇప్పటికీ తాగునీటి కష్టాలు తీరలేదు. సోమవారం కొలాం గిరిజనులు కుటుంబ సమేతంగా బొజ్జుగూడ నుంచి ఖాళీ బిందెలతో కాలినడకన ఎంపీడీవో కార్యాలయానికి సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కనీసం ఎంపీడీవోకు సమస్యను తెలుపుదామని వస్తే అందుబాటులో లేకపోవడంతో వెనుతిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మొరపెట్టుకుంటున్నారు.